20

# కర్మయోగి శ్రీశేషదేవులు

శ్రీ శేషబాబు గారు మొదటి నుండి తనలో ఉన్న సత్యమును బహిర్గత పరచక రహస్యముగా ఉంచుకొనుటకే ప్రయత్నించేవారు. 1972 సమయము నుండి ఆయనలో వైరాగ్య భావనలు ఎంత ఎక్కువగా పెరిగిపోయినప్పటికీ, దైవీప్రేమ విరహాగ్ని ఆయన అంతరంగమును ఎంతగా దహించివేయుచున్నప్పటికీ తన ఆత్మనిగ్రహముతో వాటిని తనలోనే అదిమిపెట్టియుంచేవారు. తాను విరాగిననే భావాన్ని ఎన్నడూ మాటలతో వ్యక్తపరచే వారు కాదు. వైరాగ్యభావాన్ని వ్యక్తపరిచేలా వస్త్రాలంకారాలేమీ ధరించేవారు కాదు. మామూలు విద్యార్థిలాగే కనిపించుటకు ప్రయత్నించేవారు. అధ్యాత్మికతను వ్యక్తపరచే బాహ్యచిహ్నాలను ధరించుటకు ఎన్నడూ ఇష్టపడేవారు కాదు. అందరిలో ఒక్కనివలే సామాన్యమానవుని వలే కనిపించుటకే ఇష్టపడేవారు గానీ, ఆధ్యాత్మిక తత్వవేత్తగా కనిపించుకు గానీ, భక్తునిగా గుర్తింపబడుటకుగానీ ఏ మాత్రము ఇష్టపడేవారు కాదు. శ్రీకృష్ణపరమాత్మ సత్యమును సంపూర్ణముగా ఎరిగియున్నవారును సంపూర్ణముగా ఆచరించువారును అగు భగవంతుడే అయియున్నారు. అయినప్పటికీ ఆయన లోకకర్మను విసర్జించలేదు, కాషాయాన్ని ధరించలేదు, భక్తి చిహ్నములేమీ ధరించలేదు. ఆయన తన పరిధిలో తనకున్న బాహ్య బాధ్యతలన్నింటినీ ఆచరిస్తూనేయున్నారు. బాహ్యవిలాస సంబంధమైన అలంకరణలను, చిహ్నాలను ధరించినారే గానీ సత్యపరునిగా గుర్తింపచేసే చిహ్నాలేమీ ధరించలేదు. బాహ్యకర్మలను విసర్జించకుండా ఆయన దేహము బాహ్య కర్మలలో నిమగ్నమైయున్నను. ఆయన ఆత్మను, మనస్సును ప్రతిక్షణము భగవంతుడినే సంపూర్ణముగా పట్టుకునియుండే యోగస్థితిలోనే నిలిపియుంచిన కర్మయోగి శ్రీకృష్ణపరమాత్మ. ఆయన తనలోని సత్యమును పూర్తిగా రహస్యము చేసి, పైకి మామూలు సామాన్య లౌకిక మనిషిలాగే కనిపించినారు, ప్రవర్తించినారు. శ్రీ కృష్ణపరమాత్మ యొక్క ప్రవర్తననే శ్రీ శేషబాబుగారు ఆదర్శముగా స్వీకరించినారు. తనలోని జాలి, వైరాగ్యము, ఆత్మవిమర్శ, సర్వసంగపరిత్యాగము, శరణాగతి, సత్యఆతృత వంటి దైవీగుణాలను ఎన్నడూ బహిర్గతపరచరాదని, వాటికి సంబంధించిన బాహ్యచిహ్నాలేమీ ధరించరాదని సామాన్యమానవుని వలెనే కనిపించాలని, బాహ్య అలంకార చిహ్నములనే ధరించాలని నిర్ణయించుకొనినారు. జీవితమంతా దానినే సంపూర్ణముగా ఆచరించినారు.

continue...

1995లో శ్రీ శేషబాబు గారు తమ శిష్యుడగు శ్రీనుబాబు యందు శ్రీ శిరిడిసాయిబాబా వారి ఆత్మను ప్రవేశింపచేసి సాంగత్యము చేసియున్నారు. 22-11-1998 న శ్రీ శేషబాబుగారిలో అవతారుడు మేల్కొనే వరకు ఇక్కడే ఉన్న శ్రీ సాయిబాబావారు ప్రతిరోజూ గంటల తరబడి సత్యవిషయాలను శ్రీ శేషబుగారితో చర్చించే వారు. సత్యబోధప్రియులైన శ్రీ గురుదేవులు ఆ బోధ ఎంతో ఆతృతగా, వినయంగా, గౌరవంగా స్వీకరించేవారు. శ్రీనుబాబు తన శిష్యుడనే విషయాన్ని మరచిపోయేవారు. అతనిలో శ్రీ సాయిబాబా వారినే చూస్తూ ఉండేవారు. శ్రీ సాయిబాబాను తమ పెద్దన్నయ్యగా భావించే ఆయన, శ్రీ సాయిబాబా ప్రత్యక్షముగా ఇంటికి వస్తే ఎంత ఆదరాభిమానములు చూపించాలో అంతగా ఆదరించేవారు. తన యొక్క ప్రాణాన్ని, మనస్సును, దేహాన్ని తనకున్న అన్ని విధాలైన ఐశ్వర్యములను, సమస్తాన్నీ శ్రీ సాయిబాబా గారి పాదములవద్ద పెట్టేసి సర్వసంగపరిత్యాగిగా ఆయన ముందు చేతులు కట్టుకుని నిలబడేవారు. 1972లో సర్వసంగపరిత్యాగము చేసి గుండు చేయించుకుని, అన్నవరంలో శ్రీ సత్యదేవుని ముందు నిల్చొని తండ్రీ నన్ను స్వీకరించు అని ప్రార్థించినారు. అలాగే 1995లో తమ సత్యసోదరుడు, పెద్దన్నయ్య అగు శ్రీ సాయిబాబాగారు తమ యెదుటకు రాగానే సర్వస్వాన్నీ పరిత్యజించి వినయముగా, గౌరవముగా ఆయన ముందు చేతులు కట్టుకుని సత్యబోధను అనందముగా ఆలకించినారు. 1972 నుండి 1995 మధ్యలో ఉన్న 23 ఏళ్ళలో ఎన్నో మార్పులు వచ్చినవి. కీర్తి, కాంత, కనకములనే ఐశ్వర్యములను ఆయన ధరించియున్నారు. సంసారము, భార్యాబిడ్డలు, ఇల్లు పొలములు, ఆస్తులు, అలంకారములు, భోగభాగ్యములు ఎన్నింటినో ఆయన ధరించియున్నారు. కానీ అవి ఏవీ కూడా ఆయన దేహమునకు ఉన్నవే తప్ప, ఆయన మనస్సును అణుమాత్రమైనా తాకని, పట్టని నిష్కామ కర్మయోగి శ్రీ శేషప్రభువు.

సద్గురుమూర్తియగు శ్రీ మశ్చీంద్రనాధులవారి చరిత్రలో ఒక ఘట్టమున్నది. సర్వసంగ పరిత్యాగియు, సన్యాసియు అగు శ్రీ మశ్చీంద్రనాధులవారు ఆశ్రమమును తమ ప్రియశిష్యుడగు శ్రీ ఘోరక్‌నాధుల వారికి అప్పగించి తాను దేశాటనకు వెళతారు. అలా పర్యటిస్తుండగా ఒక దేశము యొక్క మహారాణి ఆయనను ప్రేమించి వివాహమాడమని కోరగా ఆయన అంగీకరించి వివాహము చేసుకుని కుమారుడిని కని రాజుగా రాజ్యవ్యవహారాలు కూడా చూస్తుంటారు. ఆయన దేహము ఎన్ని కర్మలలో నిమగ్నమైనను గానీ అవేమీ ఆయన మనస్సుకు అంటకుండా సంపూర్ణముగా సత్యమునే పట్టుకొనియుండి కర్మయోగిగా జీవిస్తుంటారు. తన భార్య పుత్రులకంటే ఎక్కువగా శిష్యుడగు శ్రీ ఘోరక్ నాధుడినే ప్రేమిస్తూయుంటారు. కానీ ఆశ్రమములో ఉన్న శ్రీ ఘోరక్‌నాధులవారికి తన గురుదేవుల కర్మయోగత్వము అర్థము కాదు. తన గురువు భార్యాబిడ్డలు, రాచరికము అనే బంధాలలో చిక్కుకు పోయినారని ఆత్మశక్తిని కోల్పోయినారని భ్రమపడతాడు. గురువును ఎలాగైనా మాయనుండి రక్షించాలని, అవసరమైతే తన శక్తితో గురువుయొక్క మాయాబంధాలను శిక్షించి అయినాసరే గురువును మాయా బంధ విముక్తుడిని చేయాలని ప్రయత్నిస్తాడు. అయితే శిష్యుడు తన వద్దకు రాగానే శ్రీమశ్చీంద్రనాధుడు అప్పటి వరకు ధరించియున్న రాజ్యము, భార్యాబిడ్డలు అనే బంధాలన్నింటినీ వదిలేసి పూర్వపు సన్యాసిగా, సర్వసంగపరిత్యాగిగ ప్రత్యక్షమై శిష్యునితో వచ్చేస్తారు. అది చూచిన శ్రీ ఘోరక్‌నాధుడు గురువు యొక్క కర్మయోగతత్వమును గ్రహించలేకపోయినందుకు, గురువు మాయలో చిక్కుకుపోయినారని అభ్యంతర పడినందుకు సిగ్గుతో పశ్చాత్తాపపడతారు.


continue...

శ్రీమశ్చీంద్రనాధుల వారివలే శ్రీ శేషుబాబుగారు కూడా తన దేహమునకు ధరించియున్న సమస్త మాయను పరిత్యజించి శ్రీ సాయిబాబావారి యెదుట సర్వసంగ పరిత్యాగిగా ప్రత్యక్షమైనారు. లోకములోని మాయాపరికరములన్నింటినీ ధరించియే జీవించుచున్నప్పటికీ ఏమాయాపరికరముగానీ, ఏ మాయాబంధముగానీ, ఏ మాయాపరిస్థితిగానీ ఆయనను అణుమాత్రమైనా బంధించలేదు. దేహము అన్నింటి మధ్యలో ఉన్నను ఆయన మనస్సుతో, ఆత్మతో నిరంతరము సత్యమునే పట్టుకునియుండి యోగస్థితిలోనే నిలిచియుండి తామరాకుపై నీటిబొట్టులా మాయ అంటకుండా జీవించిన సంపూర్ణకర్మయోగియే శ్రీ శేషుప్రభువు. శ్రీ శేషుబాబుగారు శ్రీ సాయిబాబా వారిని పెద్దన్నయ్యగా భావించెడివారు. శ్రీ సాయిబాబావారు కూడా శ్రీ శేషుబాబు గారిని తమ పెద్దన్నయ్యగానే భావించెడివారు. తాను సద్గురువుగానే ఉన్నానని, శ్రీ శేషుబాబు గారు అవతారుని స్థాయిని పొందుచూ తనకంటే పెద్దవారైయున్నారని భావించెడివారు. కావున ఆయనను తనకు పెద్దన్నయ్య గానే భావిస్తూ గౌరవముతో, వినయముతో సత్య విషయాలను చర్చించేవారు. ఇరువురూ ఒకరినొకరు పెద్దన్నయ్యగానే భావించుకుంటూ, సంబోధించుకుంటూ ఇరువురూ ఒకరినొకరు గౌరవించుకుంటూ ఉండేవారు.

